నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు సీబీడీ ఏడీఈ బోయిన్‌పల్లి లక్ష్మీనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ మరమ్మతులు, అదేవిధంగా 11 కేవీ పీబీఆర్ ఫీడర్ పరిధిలోని బాలనగర్ మెయిన్ రోడ్డు, రాజుకాలనీ, సాయికాలనీ, బీహెచ్‌ఈఎల్ ఆర్‌అండ్‌డీ, బాలానగర్ పోలీస్‌స్టేషన్, సాయి బాలాజీ కాంప్లెక్స్, బాలానగర్ ఫ్లైఓవర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ శోభన కాలనీ ఫీడర్ పరిధిలోని శోభన కాలనీ, మాధవి నగర్, షిర్డీ సాయికాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

11కేవీ మినీ ఇండస్ట్రీ ఫీడర్ పరిధిలో..

సుభాష్‌నగర్: విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్యభార్గవ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మినీ ఇండస్ట్రీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వల్లభాయ్ పటేల్‌నగర్, వివేకానందనగర్, శ్రీనివాస్‌నగర్ కాలనీ, ఆర్‌ఎంనగర్, కృష్ణవేణి స్కూల్ రోడ్డు, హాజీ అలీ మజీద్ రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

ప్రజావాణికి 12 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్: జంటసర్కిళ్ల పరిధిలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహలు ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి ప్రజావాణి మంచి వేదిక అని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్ సెక్షన్ (2), టౌన్‌ప్లానింగ్ (1), ఎలక్ట్రికల్(1), గాజులరామారం సర్కిల్ పరిధిలో టౌన్‌ప్లానింగ్ (4), ఇంజినీరింగ్ (4) ఫిర్యాదులు అందాయి.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో ప్రజలు

దుండిగల్: ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంఘాల సభ్యులు శంభీపూర్ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీనిచ్చారు. అదేవిధంగా పలు శుభకార్యాల వేడుకల ఆహ్వాన పత్రికలను అందజేశారు.

అసంపూర్తి పనులతో అవస్థలు..!



ఆదర్శ్‌నగర్‌లో రోడ్డుపైనే ఉన్న మట్టి

రంగారెడ్డినగర్: అసంపూర్తి అభివృద్ధి పనులతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శ్‌నగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలోని గల్లీలో రూ.8 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఇటీవల పూర్తి చేశారు. అయితే సదరు కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి పైపులైనుల వేసిన అనంతరం మట్టిని చదును చేయకుండానే వదిలేశాడు. దీంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై కుప్పలు ఉండడంతో రాత్రి వేళల్లో ద్విచాహనదారులు కింద పడుతున్నారని, సంబంధిత జలమండలి అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను విడుదల చేయాలి



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చే యాలని ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ జిల్లా కమిటీలు సంయుక్తంగా డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ సంఘాల జిల్లా ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. దీనికి ముందు కలెక్టరేట్ ఎదుట రెండు సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలపీర్ మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద పేద బడుగు బలహీన పిల్లలు చదువుకుంటున్నారని పేర్కొన్నారు.

◆ ప్రతి ఏటా ఫీజులు చెల్లించాల్సిన ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో పెట్టటం వల్ల దళిత,గిరిజన విద్యార్థుల చదువులకు దూరమవుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పిల్లలకు భోజన వసతి కల్పించకుండా వారి తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద బకాయి పడిన డబ్బులను చెల్లించేలా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వడానికి దాదాపు 3గంటల పాటుగా కలెక్టరేట్ ఆఫీస్‌లో కూర్చున్నామని అనినారు. వినతి పత్రాలు సమర్పించటం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కర్ణాకర్, నందీశ్వర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల కోసం పడిగాపులు..!

కార్యాలయం చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణలు



ప్రభుత్వం ఏర్పడిన ఆసరా పింఛన్ పెరగలేదు..

కుత్బుల్లాపూర్: ప్రభుత్వం ఆసరా పింఛన్ల విషయమై ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో దరఖాస్తుదారులు సర్కిల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 2022 జూలై నుంచి ఇప్పటివరకు పలువురు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ పింఛన్ మంజూరు కాలేదు. దీంతో వారంతా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. అధికారులు మాత్రం అది తమ పరిధి కాదు అన్నట్లుగా పంపిస్తున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో మొత్తం 13,990 మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతరులు పింఛన్ తీసుకుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఆసరా పింఛన్ మాత్రమే ప్రతినెలా వస్తోంది. దివ్యాంగులకు రూ.4016, వితంతువులు, వృద్ధులకు రూ.2016 వారి ఖాతాలో ప్రతినెలా జమ అవుతున్నది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే వృద్ధులకు రూ.4వేలు, వితంతులు, దివ్యాంగులకు రూ.6 వేల చొప్పున అందజేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. దీంతో ఈ విషయమై కూడా పలువురు లబ్ధిదారులు కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు.

పోగొట్టుకున్న 28 సెల్‌ఫోన్ల అప్పగింత



సెల్‌ఫోన్లు అందుకున్న బాధితులతో డీసీపీ

జీడిమెట్ల: జీడిమెట్ల పీఎస్ పరిధిలో పోగొట్టుకున్న 28 ఫోన్లను క్రైం బ్రాంచ్ పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. షాపూర్ నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో డీసీపీ కే సురేశ్ కుమార్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్, డీఐ కనకయ్యతో కలిసి సోమవారం సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఇటీవల 28 మంది సెల్‌ఫోన్లు పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆయావివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. అనంతరం సదరు ఫోన్లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వినియోగించడాన్ని గుర్తించిన పోలీసులు వారి నుంచి రూ.5లక్షల విలువైన 28 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఎక్కడైనా ఎవరైనా సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సెల్‌ఫోన్ రికవరీలో ప్రత్యేక శ్రద్ధ చూపిన జీడిమెట్ల పోలీసులను డీసీపీ అభినందించారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు



స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీశ్ గౌడ్

బాలానగర్: ప్రజలకు ఇబ్బందుల్లేకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని పార్థీబస్తీలో శిథిలావస్థలో ఉన్న స్కూల్ భవనాన్ని రూ. 50 లక్షల నిధులతో పునర్ నిర్మించగా స్థానిక కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కార్పొరేటర్ పాదయాత్ర చేసినప్పుడు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు అనిల్ కుమార్ స్కూల్ భవనం శిథిలావస్థలో ఉందని, పునర్నిర్మించాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే రూ. 50 లక్షల నిధులు మంజూరు చేసి నూతన భవనాన్ని నిర్మించామని పేర్కొన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు పెండింగ్‌లో ఉంటే అంచనాలు వేసి తన దృష్టికి తీసుకు రావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ శంకర్, రాధాకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు కుతాడి రాములు, డివిజన్ అధ్యక్షుడు కంచి భిక్షపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటుందని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ ఫేజ్ 2కు చెందిన కుమార్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆమె సోమవారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుమార్ మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు.

మార్కెట్లోకి డాజ్లింగ్ డిజైర్ విడుదల



డాజ్లింగ్ డిజైర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని కల్యాణి మోటార్స్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు, పండాల సతీశ్ గౌడ్‌తో కలిసి మారుతి సుజికి డాజ్లింగ్ డిజైర్‌ను సోమవారం సోమవారం మార్కెట్లోకి విడుదల చేశారు. కార్యక్రమంలో కల్యాణి మోటార్స్ సీఈఓ వెంకటేశ్వరరావు, బ్రాంచి ఏజీఎం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలి



ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న శ్మశాన వాటిక కమిటీ సభ్యులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వీ రామారావునగర్ హిందూ శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ హిందూ శ్మశాన వాటిక కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశాన వాటికలో కార్యాలయం, వాచ్‌మెన్ రూము పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ప్రహరీ ఎత్తు పెంచాలని, రెండు దహన వాటికలు నిర్మించాలని పేర్కొన్నారు. లైట్లు కూడా వెలిగిలే చూడాలని కోరారు. ఎమ్మెల్యే కూడా సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో నాగుల సత్యం గంగపుత్ర, బీ నరసింహ, బోడ శ్రీనివాస్. పీఆర్. శివ రాములు, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర ఆలయంలో పూజలు



సుభాష్‌నగర్: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని సూరారం ఉమామహేశ్వర ఆలయంలో స్వామివారికి లక్ష బిల్వ పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మదన్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, రాజేందర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సీసీ రోడ్ల పనులకు మోక్షం



కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ ప్రధాన రోడ్డు పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు కొన్ని నెలలుగా మరమ్మతులకు గురై అధ్వానంగా మారింది. దీనివల్ల వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై 'సాక్షి' పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా నామమాత్రంగా ప్యాచ్‌వర్క్‌లు చేసి చేతులు దులుపుకున్నారు. తాజాగా ఈనెల 8న రోడ్డు దుస్థితిపై 'సాక్షి' మరోసారి కథనం ప్రచురితం చేయడంతో అధికారులు స్పందించారు. 75 మీటర్ల పొడవు, 6 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఇది పూర్తయితే ఇక వాహనదారులు, స్థానికులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

నేడు ద్విచక్రవాహనాల వేలం

బాలానగర్: బాలానగర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు ఈనెల 19న (నేడు) వేలం నిర్వహించనున్నట్లు బాలానగర్ ఎక్సైజ్ సీఐ డీ వేణుకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో మేడ్చల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్‌జిల్లా అధికారి ఆధ్వర్యంలో వేలం ప్రారంభమవుతుందని ఆసక్తి గల వారు రూ. 2 వేల విలువైన డీడీతో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకుని బాలానగర్ శోభన కాలనీలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఎక్సైజ్ సీఐ వేణుకుమార్ 8712658739, ఎస్ఐ 9492460840, 9966636987 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బాలానగర్: కేపీహెచ్‌బీకి చెందిన హరిప్రియకు రూ. 30 వేలు సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సాయం మంజూరైంది. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం చెక్కును లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, అస్లాం, మొయినొద్దీన్, సుంకన్న, అరుణ్, నరసింహ యాదవ్, పల్లపు వేణు, రాజు పటేల్, ఆదిరెడ్డి, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

5 నెలల గర్భిణి ఆత్మహత్య

సుభాష్‌నగర్: 5 నెలల గర్భిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం పాండు బస్తీకి చెందిన గణపతి, లావణ్య (21) భార్యాభర్తలు. సోమవారం గణపతి పనుల కోసం బయటకు వెళ్లగా ఇంట్లో లావణ్య మాత్రమే ఉంది. సాయంత్రం భర్త ఇంటికి వచ్చి చూసేసరికి సీలింగ్‌ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దీంతో స్థానికుల సహాయంతో ఆమెను కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతికి గల కారణాలు తెలియరాలేదు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్



చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: నిరుపేదలకు సీఎంరిలీఫ్‌ఫండ్ వరం లాంటిదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన బసంతి భాయ్, ప్రకాశ్ గౌడ్, డీ కృష్ణ, జే నారాయణ రాజుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఒక్కొక్కరికి రూ. 60 వేల చొప్పున మంజూరు కాగా, సంబంధిత చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాసరెడ్డి, మల్లం శ్రీనివాస్, సంజయ్ కుమార్, మోతే శ్రీనివాస్, గుమస్తా మధుసూదన్, షాకీర్, రామిరెడ్డి, నరేందర్ తోకల శ్రీను, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు, నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు శ్రీశైలంగౌడ్‌ను కలిసి పలు సమస్యలపై వినతులు అందజేశారు. పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

చిన్నారుల హక్కుల బాధ్యత అందరిది



మాట్లాడుతున్న మేయర్ కొలన్ నీలారెడ్డి

నిజాంపేట్: సమాజంలో అందరిలాగే చిన్నారులకు సైతం ప్రత్యేక హక్కులుంటాయని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఈ నెల 20న అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కైసర్‌నగర్ క్రాస్‌రోడ్డులోని డిపార్ట్ ఆఫ్ జువైనల్ వెల్ఫేర్ కరెక్షనల్ సర్వీసెస్ – వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున బాలుర ప్రత్యేక సదనాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల హక్కులను పరిరక్షించడం మన అందరి బాధ్యత అన్నారు. సత్ప్రవర్తనతో విద్యనభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి హాజరైన సూపరింటెండెంట్ ఆఫ్ డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఆఫీసర్ సుజాత గౌతమి, డిప్యూటీ సూపరింటెండెంట్ కాశీ విశ్వనాథ్, సీనియర్ హౌస్ మాస్టర్ ఉమేశ్ బాలురకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం హౌస్‌లోని నూతన భవనాన్ని సందర్శించిన అధికారులు ఆవరణలో సాగు చేస్తున్న పండ్లు, కూరగాయల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత శిక్షణ కేంద్రాన్ని సందర్శించి పిల్లలు నేసిన బ్లాంకెట్స్, కార్పెట్స్, డోర్ మ్యాట్స్ పరిశీలించి నైపుణ్యాన్ని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సుకృత, కాంగ్రెస్ మహిళా నాయకురాలు సబితా జలంధర్ రెడ్డి, సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, ఆంజనేయ వర్మ, భాస్కర్ చారి, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి



జీడిమెట్ల డిపో ఎదుట కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

సుభాష్‌నగర్: ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి కుత్బుల్లాపూర్ మండల సీఐటీయూ కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం డిపోల ఎదుట చేపట్టనున్న ధర్నాలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం జీడిమెట్ల డిపో ఎదుట కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 డిసెంబర్ నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాలపై కొనసాగుతున్న ఆంక్షలు ఎత్తివేయాలన్నారు. అలాగే ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. కార్మికుల సామాజిక భద్రత పథకాలైన పీఎఫ్, ఎస్‌బీటీ ట్రస్టులకు కార్మిక సంఘాల ప్రతినిధుల భాగస్వామ్యంతో బోర్డ్ ఆఫ్ ట్రస్టీలను నియమించాలని, ప్రజాతంత్ర హక్కులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు శ్రీనివాస్, గీత, మహేందర్ తదితరులు పాల్గొన్నారు

సర్వే తనిఖీ చేసిన కలెక్టర్

ఘట్‌కేసర్: కులగణన సర్వేను జిల్లా కలెక్టర్ రాధి కాగుప్తా, మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్యతో కలిసి మున్సిపాలిటీలో సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వేపై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. బీసీల సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ ఉన్నతికి ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో ఇన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి పూర్తి సమాచారం నమోదు చేయాలన్నారు. మేనేజర్ మల్లారెడ్డి, జంగయ్య యాదవ్, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



కూకట్‌పల్లి: మైత్రీనగర్‌లోని కెనడీ హైస్కూల్‌లో అయ్యప్ప స్వామి మహా పడిపూజను సోమ వారం వైభవంగా నిర్వహించారు. గురుస్వామి వేణుగోపాల్ రెడ్డి ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గురుస్వామి వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరయ్యారు. ఫణి గురుస్వామి కరకమలములతో పూజలు నిర్వహించారు. పంచగిరీశ భక్త సమాజం వారు ఆలపించిన భక్తి కీర్తనలతో ప్రాంగణమంతా అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమోగింది. హైస్కూల్ యాజమాన్యం గురుస్వామి వడ్డేపల్లి రాజేశ్వరరావును ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యే అనుచరుడిపై కేసు



బండ మల్లేశ్

జీడిమెట్ల: సీఎం రేవంత్ రెడ్డి, వారి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద అనుచరుడు బండ మల్లేశ్‌పై జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బండ మల్లేశ్ సీఎం రేవంత్‌రెడ్డి, వారి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే గాక సదరు పోస్టులను వివిధ సోషల్‌మీడియాల్లో పోస్టు చేశాడు. అంతేగాకుండా సీఎం ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేస్తూ అసత్య ప్రచారాలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేస్తున్నాడని గాజులరామారం వివేకానందనగర్‌కు చెందిన మన్నె దామోదర్ ఈనెల 16న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందుకు సంబంధించిన సోషల్ మీడియా లింకులను సైతం పోలీసులకు అందించాడు. దీంతో అదేరోజు జీడిమెట్ల డీఐ కనకయ్య ఎంక్వైరీ చేసి బండ మల్లేశ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే బండ మల్లేశ్‌ను అదుపులోకి తీసుకోలేదని పోలీసులు తెలిపారు.

కలెక్టరేట్ అటెండర్ శివకుమార్‌కు నివాళి

సాక్షి,సిటీబ్యూరో: కలెక్టరేట్‌లో అటెండర్ (ఔట్ సోర్సింగ్) పని చేస్తున్న శివకుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం పట్ల డీఆర్‌ఓ హరిప్రియ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌లో కలెక్టరేట్ అటెండర్ శివకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ హరిప్రియ మాట్లాడుతూ అందరితో కలసిమెలసి నడుచుకునే అటెండర్ శివకుమార్ మృతి చెందటంపై విచారాన్ని వ్యక్తం చేశారు. బాధ్యతగా విధులు నిర్వర్తించే శివకుమార్ మృతి చెందారంటే నమ్మలేక పోతున్నామని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి శివకుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాంమోహన్‌రావు, వివిధ శాఖల ఉద్యోగులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. దీనికి ముందు కలెక్టరేట్ అటెండర్ శివకుమార్ మృతికి సంతాప సూచకంగా ఉద్యోగులు,సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029